
www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
11 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 283

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## ఉక్కు మహిళకు నోబెల్



**ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారం**
**నోబెల్ శాంతి బహుమతి ప్రకటన**
**మరియా కొరినా మచాడోకు**
**పోరాటం ఫలితంగానే ఆమెకు**
**నార్వేజియన్ నోబెల్ కమిటీ వెల్లడి**
**పార్లమెంటులో ప్రతిపక్ష నాయకురాలు**

విశాలభారతి, అంతర్జాతీయం: ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటివరకు మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్ రంగాల్లో ఇప్పటివరకు నోబెల్ విజేతలను ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా నోబెల్ శాంతి బహుమతి ప్రకటించారు. మరియా కొరినా మచాడో కు ఈ ఏడాదికి సంబంధించిన నోబెల్ శాంతి పురస్కారం వరించింది. మరియా కొరినా మచాడో వెనిజులా పార్లమెంట్ సభ్యురాలు. వెనిజులా ప్రజల కోసం మరియా కొరినా మచాడో చేసిన

మిగతా 2లో..

## అలకపాన్పుపై మాజీ ఎంపీ అంజన్

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వ్యవహారం**
**కాంగ్రెస్ పార్టీలో కాకరేపుతోంది**
**మాజీ ఎంపీ అంజన్ కుమార్ ఆగ్రహం**
**పార్టీ టికెట్ తనకు కేటాయించలేదు**
**కాంగ్రెస్ పార్టీ నేతలు ఇంటికి క్యూ**
**సముచిత స్థానం దక్కుతుందని హామీ**

03



## హుజూరాబాద్‌లో నేనే లీడర్

**ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు**
**బీ ఫారమ్‌లను నేనే ఇస్తాను**
**హుజూరాబాద్‌లో 25 ఏళ్లుగా ఉన్నా**
**కార్యకర్తలు పూర్తి విశ్వాసం ఉంది**
**బీసీలకు న్యాయం జరగాలి**
**కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హుజూరాబాద్ నియోజకవర్గానికి తానే లీడర్నని ఈటల రాజేందర్ ప్రకటించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన బీ ఫారమ్‌లను తానే ఇస్తానని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈటల రాజేందర్ అనుచరులకు కాకుండా ఇతరులకు పోటీ చేసే చాన్స్ వస్తోందని ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. హుజురాబాద్‌లో 25 సంవత్సరాలుగా తాను లీడర్‌గా ఉన్నానని, బీజేపీ పార్టీకి సంబంధించిన బీ ఫారమ్‌లు

మిగతా 2లో..

# జూబ్లీహిల్స్‌లో బీజేపీ మూడు ముక్కలాట

### జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్


**రెండ్రోజుల్లో నామినేషన్లు**
**బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించింది**
**కాంగ్రెస్ క్యాండిడేట్ అనౌన్స్**
**బీజేపీ అభ్యర్థిని ఖరారు చేయలేదు**
**చివరి క్షణం వరకు ఉత్కంఠ**




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. రెండ్రోజుల్లో నామినేషన్లు కూడా స్టార్ట్ కానున్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలో దూసుకెళ్తోంది. కాంగ్రెస్ లేటెస్ట్‌గా క్యాండిడేట్‌ను అనౌన్స్ చేసి..గ్రౌండ్‌లోకి దిగేందుకు అస్త్రాలను రెడీ చేసుకుంటోంది. మరో ప్రధాన రాజకీయ పార్టీ అయిన బీజేపీ మాత్రం ఇప్పటికీ జూబ్లీహిల్స్ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. బీజేపీలో ఎన్నికలు ఏవైనా అభ్యర్థి ఎంపిక అనేది చివరి క్షణం వరకు ఉత్కంఠగానే ఉంటుంది.
ఇప్పుడు కూడా అదే సీన్ కంటిన్యూ అవుతోంది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వరుస భేటీలు నిర్వహిస్తూ అభ్యర్థి ఎంపికపై కసరత్తు చేస్తున్నారు నేతలు. ఈ క్రమంలోనే ఆశావహులు ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా బొంతు రామ్మోహన్ పేరును నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రతిపాదించారంట. గతంలో బొంతు రామ్మోహన్ ఏబీవీపీలో పనిచేశారని..మొన్నటి వరకు కాంగ్రెస్‌లో టికెట్ ఆశించి జూబ్లీహిల్స్‌లో కూడా పని చేశారని.. ఆయనకు టికెట్ ఇస్తే పార్టీకి కలిసి వస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ముందు అరవింద్ ప్రపోజల్ పెట్టారంట.
పార్టీ టికెట్ ఇస్తుందన్న భరోసా ఇస్తే రామ్మోహన్ పార్టీలోకి వచ్చేందుకు రెడీగా ఉన్నారని అరవింద్ అంటున్నారట. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ గెలవాలంటే బలమైన అభ్యర్థి ఉండాలని సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తేనే పార్టీ గెలుస్తుందని..రామ్మోహన్ అయితేనే బాగుంటుందని ఆయన సూచించారట. అయితే బీజేపీ అభ్యర్థిగా తన పేరు తెరమీదకు రావడం వెనుక తనకు ఎలాంటి సంబంధం లేదని బొంతు రామ్మోహన్ చెప్తున్నారు. అది వేరే విషయం అయినా.. అరవింద్ బొంతు పేరును ప్రతిపాదించడం చర్చనీయాంశంగా మారింది.
ఇక లంకల దీపక్ రెడ్డి కిషన్ రెడ్డిని నమ్ముకుని జూబ్లీహిల్స్‌లో పనిచేసుకుంటూ పోతున్నారట. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సికింద్రాబాద్ పార్లమెంట్

మిగతా 2లో..




## హాట్ కేకులా రాయదుర్గం రియల్ ఎస్టేట్

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం
- దిమ్మతిరిగేలా భూముల ధరలు
- ఎకరా ప్రభుత్వ భూమి రూ.177 కోట్లు
- భూమి విలువకు కొత్త బెంచ్‌మార్క్
- ఎయిర్‌పోర్టుకు రాకపోకలకు సులభం
- హైదరాబాద్ గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని...హైడ్రా ప్రభావంతో రియల్ భూమ్ పడకేసిందని ప్రచారం జరుగుతుంది. అయితే ఇది నిజమేనా అని అనుకుంటున్న తరుణంలో రాయదుర్గం భూముల వేలం ధరలు దిమ్మతిరిగేలా సమాధానం ఇచ్చాయి.రాయదుర్గంలో ఎకరా ప్రభుత్వ భూమి రూ.177 కోట్లు పలకడంతో ఏందిరా సామీ ఇది అంటూ అంతా ఆశ్చర్యపోయారు. రియల్ ఎస్టేట్ పడిపోయింది అని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఎకరం వందల కోట్లు పలకడంతో ఔరా అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్ రాయదుర్గం నగరంలో భూముల వేలం సరికొత్త రికార్డు నెలకొల్పింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం భూమి ఏకంగా రూ.177 కోట్లు పలికింది. తెలంగాణ ప్రభుత్వం/తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన వేలంలో రాయదుర్గంలో భూమికి రికార్డు ధర లభించింది.హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని రాయదుర్గంలో జరిగిన 7.67 ఎకరాల తాజా వేలంలో ఎకరానికి రూ.177 కోట్ల రికార్డును సాధించింది. ఇది తెలంగాణలో భూమి విలువకు

మిగతా 2లో..



## జనంలోకి..!

**తెలంగాణలో కీలక పరిణామం**
**మావోయిస్టు నేతలు లొంగుబాటు**

02

## పొట్టిగా ఉన్నాడని బావని చంపాడు

- పెళ్లి అంటేనే భయపడేలా ఘటనలు
- ఆశ్చర్యానికి గురి చేసే షాకింగ్ ఘటన
- ఏపీలో సంచలనంగా మారింది బావమరిది కిరాతకంగా హత్య
- నడిరోడ్డుపైనే హతమార్చాడు
- ఘటన గుంటూరు జిల్లాలో జరిగింది

02





## ఆక్రమణలపై కన్నెర్ర

**హైదరాబాద్‌లో ఆక్రమణలు**
**హైడ్రా మరోసారి ఉక్కు పాదం**
**బంజారాహిల్స్ పరిధిలో ఘటన**

02


# ఉక్కు మహిళకు నోబెల్

**( మొదటిపేజీ తరువాయి )**

అవిశ్రాంత కృషి, వారి హక్కుల కోసం చేసిన పోరాటం ఫలితంగానే ఆమెకు ఈ నోబెల్ బహుమతి దక్కినట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ వెల్లడించింది. వెనిజులా ప్రజల ప్రజాస్వామ్య హక్కులను ప్రోత్సహించడంలో మరియా కొరినా మచాడో చేసిన అవిశ్రాంత కృషి.. దాంతో పారుట నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యానికి న్యాయమైన, శాంతియుత పరివర్తనను సాధించడానికి ఆమె చేసిన పోరాటానికి గాను ఈ అరుదైన గౌరవం లభించింది. ఇక మరియా కొరినా మచాడోను వెనిజులా ఉక్కు మహిళ అని కూడా పిలుచుకుంటారు. ఇక ఆమె వెనిజులా పార్లమెంటులో ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్నారు.

వెనిజులాలో ఒకప్పుడు చీలిపోయిన ప్రతిపక్షంలో కీలక పాత్ర వహించిన మారియా కొరినా మచాడో తిరిగి ఏకీకృతం చేశారని.. నార్వేజియన్ నోబెల్ కమిటీ ఛైర్మన్ జోర్గన్ వాట్నే ఫ్రైడ్నెస్ వివరించారు. వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలు, ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వం కోసం డిమాండ్‌లో ప్రతిపక్షాలను ఐక్యం చేయడానికి ఆమె నాయకత్వం వహించారని తెలిపారు. గత ఏడాది కాలంగా.. మరియా కొరినా మచాడో దాక్కుని జీవించవలసి వచ్చిందని.. తన ప్రాణాలకు తీవ్రమైన ముప్పు ఉన్నప్పటికీ.. ఆమె వెనెజులాలోనే ఉండి పోరాటం చేసినట్లు కమిటీ తెలిపింది. ఆమెను నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక చేయడం..కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొంది. నియంతలు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడు.. ధైర్యంగా నిలబడి ప్రతిఘటించే స్వేచ్ఛా రక్షకులను గుర్తించడం చాలా ముఖ్యమని కమిటీ అభిప్రాయపడింది.!



వెనిజులా ఐరన్ లేడీగా పిలువబడే మరియా కొరినా మచాడో.. ప్రజాస్వామ్య ఉద్యమానికి నాయకురాలిగా, లాటిన్ అమెరికాలో ప్రజల ధైర్యానికి అద్భుతమైన ఉదాహరణగా నిలిచారు. ఒకప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా, సంపన్న దేశంగా ఉన్న వెనెజులా.. ప్రస్తుతం మానవతా, ఆర్థిక సంక్షోభంతో బాధపడుతున్న క్రూరమైన, నిరంకుశ దేశంగా మారింది. వెనిజులా దేశంలోని అత్యధిక మంది తీవ్రమైన పేదరికంలో మగ్గిపోతుండగా.. పాలనలో ఉన్న కొద్దిమంది మాత్రమే ధనవంతులుగా మారుతున్నారు. ఇక ప్రభుత్వం ప్రజలపై హింసాత్మక చర్యలు తీసుకోవడంతో.. దాదాపు 80 లక్షల మంది ప్రజలు దేశం విడిచి వెళ్లారు. ఎన్నికల మోసాలు, న్యాయపరమైన కేసులు, జైలు శిక్షల ద్వారా ప్రతిపక్షాన్ని అక్కడి ప్రభుత్వం అణచివేస్తోంది. ప్రజాస్వామ్య అభివృద్ధి కోసం ఏర్పడిన సుమాటే అనే సంస్థ వ్యవస్థాపకురాలిగా.. మరియా కొరినా మచాడో 20 ఏళ్ల క్రితమే స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం నడుం బిగించారు. స్వీడన్‌కు చెందిన సైంటిస్ట్, ఇంజినీర్, బిజినెస్‌మెన్‌గా ఫేమస్ అయిన ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 10వ తేదీన ఈ నోబెల్ బహుమతులు గెలుచుకున్న వారికి పురస్కారాలు అందిస్తారు. ఇక ఆ రోజు జరగనున్న వేడుకల్లో నోబెల్ విజేతలుగా నిలిచిన వారికి బహుమతితో పాటు.. 10 లక్షల డాలర్లు అంటే మన భారత కరెన్సీలో సుమారు రూ.8.8 కోట్ల నగదు అందించనున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ 1896లో మరణించగా.. 1901 నుంచి నోబెల్ ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్‌లో బీజేపీ మూడు ముక్కలాట

**( మొదటిపేజీ తరువాయి )**

పరిధిలో ఉండటంతో కిషన్‌రెడ్డి చెప్పిన వారికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. దీంతో కిషన్ రెడ్డిపై భారం వేసి దీపక్‌రెడ్డి గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారట. 2023లో పోటీ చేసిన దీపక్ రెడ్డికి 25వేల పైచిలుకు ఓట్లు రాగా..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి దాదాపు 70 వేల ఓట్లు వచ్చాయని..ఈ సారి తనకు టికెట్ ఇస్తే పార్టీ గెలవడం పక్కా అన్న ధీమాతో ఆయన టికెట్ అడుగుతున్నారట.

దీపక్‌రెడ్డికి గతంలో టీడీపీలో కలిసి పనిచేసి ఇప్పుడు బీజేపీలో ఉన్న గరికపాటి రామ్మోహన్‌రావు, అటు ఏపీ సీఎం చంద్రబాబు కూడా సపోర్ట్ చేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఇక పార్టీ సీనియర్ నేత ఆకుల విజయ కూడా టికెట్ కోరుతున్నారు. అటు బీసీ, ఇటు మహిళా కార్డును ఉపయోగిస్తూ తనకు టికెట్ ఇవ్వాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాలన్నీ బీసీల చుట్టే తిరుగుతున్నాయని తనకు టికెట్ ఇస్తే పార్టీ బీసీలకు అవకాశం ఇచ్చిందని చెప్పుకునే వీలుంటుందని అంటున్నారట ఆకుల విజయ. మరోవైపు ఆమె భర్త రెడ్డి సామాజికవర్గం కావడం కూడా కలిసి వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారట. మరోవైపు లోకల్ నినాదాన్ని ఆమె తెరపైకి తెస్తున్నారు. గతంలో పార్టీ ఆదేశాలతో ఏకంగా కేసీఆర్, కేటీఆర్‌లపైనే పోటీ చేసిన విషయాన్ని కూడా ఆమె గుర్తు చేస్తున్నారు. అటు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఢిల్లీలో బీజేపీ సంస్థాగత వ్యవహారాల చూసే మరో నేత.. ఆకుల విజయకు టికెట్ దక్కేలా చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

బొంతు రామ్మోహన్ కాంగ్రెస్‌లోనే ఉన్నారు. టికెట్ ఇస్తామంటే ఆయన బీజేపీలోకి వస్తారని ఎంపీ అరవింద్ అంటున్నారట. ఇక దీపక్‌రెడ్డికి కిషన్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నాయట. ఆయన జూబ్లీ హిల్స్ సీటు ఖాళీ అయినప్పటి నుంచి తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారట. ఇక ఆకుల విజయ బీసీ మహిళగా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ..మందకృష్ణతో పాటు ఢిల్లీలోని పార్టీ సంస్థాగత వ్యవహారాలు చేసే నేత అండతో టికెట్ కోసం లాబీయింగ్ చేస్తున్నారట. ఈ ముగ్గురిలో టికెట్ ఎవరికి దక్కబోతోంది.? లేకపోతే మరో కొత్త నేతను తెరమీదకు తెస్తారా అనేది త్వరలోనే క్లారిటీ రానుంది

# కురవి మండల కేంద్రంలో దొంగల హల్చల్

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో దొంగల హల్చల్ కొరివి మండల కేంద్రంలో బుధవారం రాత్రి సొసైటీ బ్యాంక్ రూములలో చోరీకి పాల్పడ్డారు. శ్రీ వీరభద్ర స్వామి ఆలయ సమీపంలో సాయి ఆటోమొబైల్, శ్రీ వినాయక ఫొటోస్ అండ్ రేడియం వర్క్స్, హెచ్. ఆర్ సెల్ మార్ట్, షాపులలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ షాపుల యొక్క వెనుక వైపు ఉన్న తలుపులను బద్దలు కొట్టి సాయి ఆటోమొబైల్ షాపు కౌంటర్ నుండి సుమారుగా పదివేల రూపాయల నగదును అపహరించారు. మిగతా రెండు షాపులలో తలుపులను ధ్వంసం చేసి చోరీకి యత్నించారు. ఈ సందర్భంగా సాయి ఆటోమొబైల్ షాపు యజమాని బజ్జూరి పూర్ణచందర్ రెడ్డి మాట్లాడుతూ కురవిలో ఇలాంటి చోరీలు చాలా జరుగుతున్నాయి కానీ ఆ చోరీకి పాల్పడిన వ్యక్తులు ఎవరో తక్షణమే గుర్తించి ఇలాంటి చోరీలు మరల పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

# జనంలోకి..!

- ఎడీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో
- దక్షిణ బస్తర్ దళంలో పనిచేశారు
- 403 మంది లొంగిపోయారు
- 10 మంది తెలంగాణ వాళ్లే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట ముగ్గురు కీలక మావోయిస్టు నేతలు లొంగిపోయారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు వీరు జనజీవన స్రవంతిలో కలవడానికి సిద్ధమయ్యారని డీజీపీ తెలిపారు. ఆయుధాలు వదిలేసి ప్రజల్లో కలవడానికి..కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచెర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్‌గఢ్) సాధారణ ప్రజల్లో కలవడానికి నిర్ణయించుకున్నారని డీజీపీ తెలిపారు. ఈ ముగ్గురు నేతలు దక్షిణ బస్తర్ దళంలో కీలక స్థానాల్లో పని చేశారని తెలిపారు. మొగిలిచర్ల చందు (45) మావోయిస్టు స్టేట్ కమిటీ నెంబర్‌గా చేశారని వెల్లడించారు.

ఈ సందర్భంగా డీజీపీ శశిధర్ రెడ్డి మాట్లాడారు. "కుంకటి వెంకటయ్య, మొగిలిచర్ల వెంకట్రాజు, తోడెం గంగ.. (ఛత్తీస్‌గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. వీరంతా మావోయిస్టు పార్టీ కమిటీ రాష్ట్ర స్థాయి నేతలు. తెలంగాణ సిద్ధిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య.. 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరయ్యారు. అనంతరం అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారు. పీడబ్ల్యూడీ కమాండర్ బాలన్న నేతృత్వంలోని దళంలో చేరారు. ఆ తర్వాత క్రమంగా పార్టీలో ఎదిగి.. 35 ఏళ్లపాటు వివిధ పదవుల్లో పనిచేశారు. కాగా ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకుని.. జనజీవన స్రవంతిలో కలిసేందుకు నిర్ణయం తీసుకున్నారు" అని డీజీపీ తెలిపారు.

మరోవైపు, హనుమకొండ జిల్లా ధర్మసాగరం మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు(45) కూడా లొంగిపోయారని డీజీపీ తెలిపారు. "ఈయన 11 ఏళ్ల వయసులోనే విప్లవగీతాలకు ఆకర్షితుడు అయ్యారు. అనంతరం మావోయిస్టు ఉద్యమంలో చేరారు. 1993లో నర్సంపేట దళంలో చేరిన తర్వాత.. రాష్ట్రస్థాయి కమిటీలో వివిధ పదవుల్లో పనిచేశారు. కాగా ఇటీవల మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల వల్ల పార్టీ నుంచి బయటకు రావాలనుకున్నారు. ఇక పోలీసు శాఖ ఇచ్చిన పిలుపుతో.. అతడి భార్య తోడెం గంగ అలియాస్ సోనీతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు" అని డీజీపీ తెలిపారు.

కాగా, కేంద్రం 2026 మార్చినాటి కల్లా దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మావోయిస్టులపై భీకర దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కీలక మావోయిస్టు నేతలు పార్టీ నుంచి బయటకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ మధ్యకాలంలో 403 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ పేర్కొన్నారు. ఇందులో తెలంగాణకు చెందిన 72 మంది మావోయిస్టులు ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన 12 మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో.. 10 మంది తెలంగాణ వాళ్లే ఉన్నారని వెల్లడించారు.

రానున్న రోజుల్లో మరింత మంది మావోయిస్టు కీలక నేతలు.. జన జీవన స్రవంతిలో కలుస్తారని డీజీపీ అన్నారు. మిగతా వారు కూడా త్వరగా లొంగిపోవాలని కోరారు. మావోయిస్టుల్లో విభేదాలు ఉన్న మాట నిజమేనని.. ఇటీవల ఆయుధాల అప్పగింతపై విడుదలైన లేఖ కూడా నిజమని భావిస్తున్నామని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు.. ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు.

# పొట్టిగా ఉన్నాడని బావని చంపాడు

- పెళ్లి అంటేనే భయపడేలా ఘటనలు
- ఆశ్చర్యానికి గురి చేసే షాకింగ్ ఘటన
- ఏపీలో సంచలనంగా మారింది
- బావమరిది కిరాతకంగా హత్య
- నడిరోడ్డుపైనే హతమార్చాడు
- ఘటన గుంటూరు జిల్లాలో జరిగింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుతం సమాజంలో మానవ సంబంధాలు మంట గలిసిపోతున్నాయి. ఈ మాయ రోగం వచ్చిందో తెలియదు కానీ.. పెళ్లి అంటేనే భయపడేలా పలు ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు పెళ్లి తర్వాత వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్యలు జరుగుతుంటే.. ఇప్పుడు కొత్తగా జరిగిన ఓ హృదయ విదారక ఘటన సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇన్నాళ్లు కులాంతర, మతాంతర వివాహం చేసుకున్నారని హత్యలు జరగడం చూసుంటాం. అలానే తమకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారని.. పెద్దలు ఆగ్రహించి హత్యలకు పాల్పడ్డ ఘటనలు చాలానే ఉన్నాయి. కానీ ఇప్పుడు అదే తరహాలోనే కానీ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసే షాకింగ్ ఘటన ఏపీలో సంచలనంగా మారింది. బావ పొట్టిగా ఉన్నాడని ఓ బావమరిది కిరాతకంగా అతడిని హత్య చేశాడు. పెళ్లి జరిగిన కొద్ది రోజులకే.. పక్కా ప్రణాళికతో స్నేహితుల సహాయంతో కత్తులతో పొడిచి నడిరోడ్డుపైనే హతమార్చాడు. ఈ దారుణ ఘటన గుంటూరు జిల్లాలో జరిగింది. బాపట్ల జిల్లా ఏడవులు గ్రామానికి చెందిన కుర్రా నాగ గణేష్ (25).. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సంగం జాగర్లమూడిలో కుటుంబంతో నివాసముంటున్నాడు. అతనికి గుంటూరు పవర్ ఆఫీసు సమీపంలోని బుడంపాడులో ఉద్యోగం రావడంతో గత మూడు నెలలుగా అక్కడే ఉంటున్నాడు. అయితే దూరపు బంధువైన తెనాలికి చెందిన కీర్తి అంజనీ దేవి ఇంటికి ఇటీవలే పెళ్లి చూపులకు వెళ్లాడు. ఆ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడగా.. గణేష్ పొట్టిగా ఉన్నాడనే కారణంతో అంజనీ దేవి కుటుంబం సంబంధానికి ఒప్పుకోలేదు. కానీ అప్పటికే వారు ఫోన్ నెంబర్స్ మార్చుకొని మాట్లాడుకుంటూ ప్రేమలో పడ్డారు. అయితే వారి ప్రేమకు కుటుంబాల అంగీకారం లేకపోవడంతో.. సెప్టెంబర్ 25న ఇంట్లో చెప్పకుండా పారిపోయి వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం బుడంపాడులో వారు కలిసి ఉంటుండగా.. అమ్మాయి కుటుంబం వారి నుంచి ప్రాణ హాని ఉందని.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరువురి కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే రిసెప్షన్ కోసం గణేష్ తన స్నేహితుడు కరుణతో కలిసి గుంటూరులో బంగారం తాకట్టు పెట్టి డబ్బు తీసుకొని తిరుగు ప్రయాణం అయ్యారు.

అప్పుడే పక్కా ప్లాన్ తో బుడంపాడు రోడ్డుపై దుర్గారావు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి అతనిపై దాడి చేశాడు. మొదట రాయితో కొట్టి, అనంతరం కత్తులతో విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ గణేష్‌ను కరుణ గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లినా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు దుర్గారావు, అతని సహచరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గణేష్ పొట్టిగా ఉన్నాడు.. మాయమాటలతో చెల్లిని నమ్మించి పెళ్లి చేసుకున్నాడు.. అందుకే చంపానని ఒప్పుకున్నట్టు సమాచారం.

# ఆక్రమణ దారులకు అడ్డేది

- ఫుట్ పాత్ ను సైతం వదలని వైనం
- సామాజిక కార్యకర్త లాయర్ కర్నే రవి
- మున్సిపాలిటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేత




**మణుగూరు, విశాలభారతి :**

మణుగూరు సురక్ష బస్టాండ్ పరిధిలో ఆక్రమణదారులకు అడ్డు లేకుండా పోయింది. ఆక్రమించడానికి స్థలం లేదా అంటూ పాదాచారులు ప్రశ్నిస్తే అవమానకరమైన మాటలతో వాళ్లని హింసిస్తున్నారని సామాజిక కార్యకర్త కర్నే రవి శుక్రవారం ఆరోపించారు. ఈ విషయమై మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సురక్ష బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రధాన రహదారిని ఆక్రమించారని తెలిపారు. రహదారిని ఆక్రమించడమే కాకుండా షాపులు నిర్మించి, ఫుట్ పాత్ మీద, వీధి వ్యాపారులుకు రెంట్ కు ఇస్తూ 3000 నుండి 5000 రూపాయలు అక్రమంగా అద్దె సంపాదిస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నించే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై సైతం తిరగబడుతున్నారని, వారిపై అసభ్యకరంగా మాట్లాడుతున్నారని రవి ఆరోపించారు. సురక్ష బస్టాండ్ దగ్గర ఉన్న ఫుట్ పాత్ పై ఆక్రమణలను ప్రధాన రహదారి పై ఇరువైపుల ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణదారులు తొలగించాలన్నారు. ఈ విషయం మీద సామాజిక కార్యకర్త కర్నే రవి మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**తొర్రూరు, విశాలభారతి:**

పౌష్టికారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ ఏసిడిపిఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని నాంచారి మడూరు అంగన్వాడి సెంటర్ లో శుక్రవారం పోషణ మాసం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులకు అంగన్వాడి కేంద్రాలలో పౌష్టికాహారం లభిస్తుందన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరదన్నారు. పిల్లల ఎదుగుదల శారీరక మానసిక వికాసం కోసం అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గౌసియా, ఎంఎల్ హెచ్ పి డాక్టర్ మాధవి, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీకి తేజశ్రీ



**మునుగోడు, విశాలభారతి :**

ఈనెల 10,11,12 తేదీలలో నిజామబాద్ లో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు మహాత్మా జ్యోతి బాపూలే మునుగోడు బాలికల పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని కె తేజశ్రీ ఎంపికైన సందర్భంగా,ఆ పాఠశాల ప్రిన్సిపల్ కే.సంధ్య రాణి మాట్లాడుతూ పాఠశాల నుండి రాష్ట్ర తైక్వాండో పోటీలో ఎంపికవడంతో తేజశ్విని అభినదించారు. ఇట్టి పోటీలో పాల్గొనేందుకు వెళ్తున్న తేజశ్రీ కి కోచ్ ఇచ్చే సూచనలను పాటిస్తూ పోటీలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని విద్యార్థికి సూచించారు.రాష్ట్రస్థాయి పోటీలలో పోటీపడే విధంగా తమ పాఠశాల విద్యార్థిని కృషి చేసిన తైక్వాండో కోచ్ అంబటి ప్రణీత్ ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఈటి నాగమణి,పిడివి విజయ,తైక్వాండో కోచ్ అంబటి ప్రణీత్ ఉన్నారు.

# కురవి బస్టాండ్ అభివృద్ధి పనులు ప్రారంభం

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఎప్పటినుంచో ప్రజలు ఎదురు చూస్తున్న బస్టాండ్ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు ప్రారంభమవ్వడానికి ప్రధాన కారణం విద్యార్థి సంఘం ఎస్.ఎఫ్.ఐ. నిరంతర పోరాటమే అని ప్రజలు చెబుతున్నారు. బురదతో నిండిపోయిన రోడ్లు, ప్రయాణికుల ఇబ్బందులు సంవత్సరాలుగా కొనసాగుతుండగా, విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు ఆందోళనలు చేసి అధికారులను కదిలించారు. ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు నాయకత్వంలో విద్యార్థులు నిరసనలు, బైక్ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి "బస్టాండ్‌కు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు.

# హుజూరాబాద్‌లో నేనే లీడర్

**( మొదటిపేజీ తరువాయి )**

తానే కేటాయిస్తానని ఈటల స్పష్టం చేశారు. "ఇక్కడి రాజకీయాల్లో నా పట్ల ప్రజలు, కార్యకర్తలు పూర్తి విశ్వాసం ఉంది. ఎవరైనా ఇబ్బంది పెడితే, నేనే ఫారమ్‌లు ఇస్తా" అని ప్రకటించారు. హుజురాబాద్ పట్టణంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఈటల్ రాజేందర్, స్థానిక ఎన్నికలు ఆలస్యమవుతున్నాయని.. బీసీలకు న్యాయం జరగాలని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ విషయంలో గందరగోళం సృష్టించింది. ముఖ్యమంత్రి ప్రజలను వంచించి, మోసం చేశారు" అని మండిపడ్డారు. బీజేపీ మొదటి నుంచి బీసీ రిజర్వేషన్‌లకు మద్దతు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి "నిజాయితీ, చిత్తశుద్ధి లేవు" అని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను "అబద్ధాల పునాది, గోల్‌మాల్"గా అభివర్ణించిన ఈటల, హైదరాబాద్‌లో పేదల గుడిసెలు కూల్చివేసి, ప్రజల బతుకులు నాశనం చేసిందని ఆరోపించారు. "ప్రజలు కాంగ్రెస్‌ను 'థు' అని అంటున్నారు. గతంలో కేసీఆర్ వేధిస్తున్నాడని చతికిల పడిన పార్టీని గెలిపించి, ఇప్పుడు ప్రజలు, ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు" అని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించి, "ఆరు గ్యారంటీలు, హామీల గురించి మాట్లాడట్లేదు. గతంలో ఉన్నవే ఇవ్వమని ప్రజలు అడుగుతున్నారని గుర్తు చేశారు.

ఈటల రాజేందర్ అంటే నిఖార్సైన ఉద్యమ బిడ్డ.



ఎక్కడ అన్యాయమున్నా కొట్లాడే బిడ్డ. ఇది నేను బొందలోకి పోయినప్పుడే పోతది" అని ఎమోషనల్‌గా ప్రకటించారు. తెలంగాణ చరిత్రలో తన పోరాటానికి 5 పేజీలు కేటాయించాలని, ఎక్కడ ఎవరు సమ్మెలు చేసినా ధర్మ యుద్ధం చేసినవాడిని అని ప్రకటించారు. "మీకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇస్తున్నాము. ఎవరికీ భయపడే వాళ్ళం కాదు. ఎప్పటికైనా ప్రజలకు తోడుగా అండగా ఉండేవాళ్ళం మేము" అని అనుచరులకు భరోసా ఇచ్చారు. పదవుల కోసం పెదవులు మూసేవారు కాదని, తన క్యారెక్టర్, కమిట్‌మెంట్, ఫైటింగ్ నేచర్‌తో పక్కా ప్రజల పక్షాన్ని ఉంటానని స్పష్టం చేశారు. ఎక్కడ ఎవరు సమ్మెలు చేసినా, ధర్మ యుద్ధం చేసిన, సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసేది మేము. మీకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇస్తున్నాము. ఎవరికి భయపడే వాళ్ళం కాదని ప్రకటించారు.

# ఆక్రమణలపై కన్నెర్ర

- రూ. 750 కోట్లు విలువ భూమి
- పార్థ సారథి అనే వ్యక్తి కోర్టుకు
- కాపలాగా వేటకుక్కలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో ఆక్రమణలపై హైడ్రా మరోసారి ఉక్కు పాదం మోపింది. బంజారాహిల్స్ పరిధిలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో చేపట్టిన ఆక్రమణలను హైడ్రా తొలగింది. తద్వారా రూ. 750 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఈ మేరకు హైడ్రా ఒక ప్రకటన విడుదల చేసింది. షేక్‌పేట మండలం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో ఆ క్రమణలను తొలగించినట్టుగా హైడ్రా తెలిపింది. 5 ఎకరాల స్థలంలో జలమండలికి ప్రభుత్వం 1.20 ఎకరాలను గతంలో ప్రభుత్వం కేటాయించిందని.. అయితే ఈ 1.20 ఎకరాలతో పాటు మొత్తం 5 ఎకరాల భూమి తనదంటూ పార్థ సారథి అనే వ్యక్తి కోర్టుకు ఎక్కినట్టుగా పేర్కొంది. అంతేకాకుండా ఆ 5 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసిన పార్థసారథి బౌన్సర్లతో పాటు వేటకుక్కలను కాపలాగా పెట్టినట్టుగా తెలిపింది. ఈ స్థలంపై కోర్టులో వివాదం కొనసాగుతుండగానే పార్థసారథి ఆ స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకుని, షెడ్డులు నిర్మించారని హైడ్రా పేర్కొంది. అక్కడ మనుషులను పెట్టుకుని పహారా కాస్తున్నట్టుగా తెలిపింది. అయితే ప్రభుత్వ భూమిని అడ్డాగా చేసుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు జలమండలి, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్టుగా హైడ్రా పేర్కొంది.

ఆ స్థలం గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని జలమండలి, రెవెన్యూ అధికారులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనేక నివప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వాటర్ రిజర్వాయర్ నిర్మించాలని జలమండలి ప్రయత్నాలను పార్థసారథి అడ్డుకున్నాడని కూడా చెప్పారు. ఫేక్ సర్వే నంబర్ (403/52) తో ప్రభుత్వ భూమి కొట్టేసే ప్రయత్నం చేసినట్టుగా ఆరోపించారు. ఈ మేరకు పార్థసారథి పై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే వాస్తవానికి 403 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంటే.. 403/52 నంబర్‌తో పార్థసారథి ఆక్రమణలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ తో 5 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ పార్థసారథి క్లెయిమ్ చేస్తున్నట్టు హైడ్రా గుర్తించింది. ఈ క్రమంలోనే షేక్‌పేట్ రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య ఆ స్థలంలో ఆక్రమణలను తొలగింపు చేపట్టింది. పార్థసారథి వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్డులను తొలగించింది. అలాగే 5 ఎకరాలను ప్రభుత్వానికి స్వాధీనం చేయడంతో పాటుగా ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది.

# హాట్ కేకులా రాయదుర్గం రియల్ ఎస్టేట్

**( మొదటిపేజీ తరువాయి )**

కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది.

రాయదుర్గంలో భూముల ధరలు అమాంతం పెరగడానికి ఈ ప్రాంతం హైటెక్ సిటీగచ్చిబౌలి ప్రాంతాల మధ్య ఉండటం ఒక కారణమైతే... మియాపూర్ మెట్రో, ఔటర్ రింగ్ రోడ్,శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలకు సులభంగా ఉండటం మరో కారణం. అంతేకాదు ఐటీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, రిటైల్, రెసిడెన్షియల్, ఎడ్యుకేషన్, హాస్పిటాలిటీ, ఐటీఈఎస్, కమర్షియల్, ఎంటర్‌టైన్మెంట్ వంటి అభివృద్ధి సంస్థలకు ఈ రాయదుర్గం అనుకూల ప్రదేశంగా ఉండటంతో పెట్టుబడిదారులు భారీ మొత్తాన్ని చెల్లించడానికి ఆసక్తి చూపిస్తున్నారు.అందుకే రాయదుర్గం హైదరాబాద్ నాలెడ్జిసిటీకి గుండెకాయగా మారింది అంటూ చర్చించుకుంటున్నారు.

రాయదుర్గంలో ఐటీ మరియు ఇతర కంపెనీలు ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. అంతర్జాతీయ సంస్థలు సైతం తమ కార్యకలాపాలను రాయదుర్గం నుంచే ప్రారంభిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రేడ్‌ఏ ఆఫీస్ స్పేస్‌లలో చదరపు అడుగుకు అద్దె రూ.70 నుంచి రూ.90 వరకు ఉంది. భవిష్యత్‌లో హైదరాబాద్ గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) కేంద్రంగా మారుతోంది. ఐటీ, ఫార్మా, ఫైనాన్స్ వంటి బహుళజాతి సంస్థలు ఇక్కడ జీసీసీలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అలాగే ఇతర దేశాల నుంచి భారీగా కంపెనీలు పెట్టుబడులు పెట్టే అవకాశం రాయదుర్గంలోనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రముఖ డెవలపర్లు హౌసింగ్, కమర్షియల్ ప్రాజెక్టుల కోసం



వేలంలో పాల్గొని భూములను కొనుగోలు చేస్తున్నారు. రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. వాస్తవానికి 2017లో రాయదుర్గంలో 2.84 ఎకరాలకు గానూ ఎకరా రూ.42.59 కోట్లు పలకింది. తాజాగా రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో రికార్డు స్థాయిలో ఎకరం ధర రూ.177కోట్లు అంటే దాదాపు 75శాతం అధికంగా వృద్ధి సాధించినట్లు టీజీఐఐసీ ఎండీ శశాంక వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇంకా చెప్పాలంటే ఎనిమిదేళ్లలో నాలుగు రెట్లు వృద్ధి చెందింది. ఇకపోతే కార్పొరేట్ కంపెనీలు నెలకొల్పేందుకు అన్ని వసతులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ముఖ్యంగా కార్పొరేటర్ కంపెనీల హెడ్ ఆఫీసులకు, ఐటీ, ఇతర సంస్థలు నెలకొల్పేందుకు అద్భుతమైన మౌలిక వసతులు ఉన్నాయి. ఈ ప్రాంతం అన్నివిధాలా అనుకూలమైన ప్రాంతం. హైటెక్ సిటీగచ్చిబౌలి ప్రాంతాల మధ్య ఉండటం ఒక కారణమైతే... మియాపూర్ మెట్రో, ఔటర్ రింగ్ రోడ్,శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉండటంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. కార్పొరేట్ సంస్థల ఆఫీసులు కేంద్రీకృతం ఐటీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, రిటైల్, రెసిడెన్షియల్, ఎడ్యుకేషన్, హాస్పిటాలిటీ, ఐటీఈఎస్, కమర్షియల్, ఎంటర్‌టైన్మెంట్ వంటి అభివృద్ధి సంస్థల కార్యాలయాలకు ఈ ప్రాంతం కేంద్రీకృతం కావడంతో పెట్టుబడిదారులు భారీ మొత్తాన్ని చెల్లించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఒకవైపు రాయదుర్గంలో వాణిజ్య భూములకు భారీ ధరలు పలకగా.. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూములు సైతం రికార్డు స్థాయి ధరలను నమోదు చేశాయి.ఇటీవల జరిగిన బహిరంగ వేలంలో 513 చదరపు గజాల విస్తీర్ణంలోని ఒక ప్లాట్‌కు చదరపు గజం (చ.గ.) ధర రూ.1.14 లక్షలు పలికింది. హెచ్ఐజీ కేటగిరీకి చెందిన మరో ప్లాట్ చ.గజం రూ.లక్షకు అమ్ముడైంది. ఈ వేలంలో మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, 4 ఫ్లాట్లకు గాను హౌసింగ్ బోర్డుకు రూ.44.24 కోట్ల ఆదాయం లభించింది. వేలంలో పాల్గొన్న 27 మంది బిడ్డర్ల కారణంగా చ.గ. సగటు ధర రూ.91,947గా నమోదైంది.

# అలకపాన్పుపై మాజీ ఎంపీ అంజన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో కాకరేపుతోంది.టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్టీ టికెట్ తనకు కేటాయించకపోగా.. కనీసం అభ్యర్థి ఎంపిక విషయంలో కూడా తనను సంప్రదించలేదంటూ అంజన్ కుమార్ యాదవ్ అలకపాన్పు ఎక్కారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు అంజన్ కుమార్ యాదవ్ ఇంటికి క్యూ కట్టారు.ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలు అంజన్ కుమార్ ఆయన నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. టిక్కెట్‌ను నవీన్ యాదవ్‌కు కేటాయించాల్సిన పరిస్థితులను వివరించారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుంది అని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు.మాజీఎంపీ అంజన్ కుమార్‌కి త్వరలో సముచిత స్థానం దక్కుతుంది అని హామీ ఇచ్చారు. నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి అని సూచించారు. పార్టీకి ఏది మంచిదో ఆ నిర్ణయమే తీసుకుంటారు. కాంగ్రెస్‌లో సమిష్టి నిర్ణయాలుంటాయి అని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు.



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున అనేకమంది పోటీపడ్డారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అలా పార్టీ సినియర్ అయిన అంజన్ కుమార్ యాదవ్ సైతం పోటీ చేయాలని భావించారని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.అయితే కాంగ్రెస్ అధిష్ఠానం మరొకరికి టిక్కెట్ కేటాయించిందని చెప్పుకొచ్చారు.నగరంలో కాంగ్రెస్ పార్టీకి అంజన్ కుమార్ యాదవ్ పెద్ద దిక్కుగా ఉన్నారని చెప్పుకొచ్చారు. అంజన్ కుమార్ యాదవ్ నేతృత్వంలోనే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందని...ఖచ్చితంగా జూబ్లీహిల్స్‌లో విజయం సాధిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ పార్టీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.జూబ్లీహిల్స్ బైపోల్ టికెట్ రాకుండా అడ్డుపడింది ఎవరో త్వరలో చెబుతానని హెచ్చరించారు. ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి తాను అర్హుడిని కాదా అని పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. కష్ట కాలంలో పార్టీ కోసం పని చేసింది ఎవరో పెద్దలు మర్చిపోయారని... చివరకు అభ్యర్థి ఎంపికలోనూ తనను సంప్రదించకపోవడం బాధ కలిగించిందని ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు లోకల్,నాన్ లోకల్ అంశంపైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ టికెట్ విషయంలో ఇప్పుడు మాత్రమే లోకల్, నాన్ లోకల్ ఇష్యూ ఎందుకొచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో కామారెడ్డిలో పోటీ చేసినప్పుడు ఆ విషయంలో ఎందుకు గుర్తు రాలేదని నిలదీశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న తాను ఎక్కడ నుంచైనా పోటీ చేయవచ్చు అని అన్నారు. వాళ్లు తొక్కుకుంటూ పోతే... మేం ఎక్కుకుంటూ పోతామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలతో భేటీ తర్వాత భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తానని అన్నారు. 40 ఏళ్ల నుంచి తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని.. మనోభావాలు దెబ్బతిన్న చాలామంది తన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. పార్టీలో ఉన్నప్పుడు నా హక్కుల కోసం నేను మాట్లాడొద్దా అంటూ అంజన్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు.ఉప ఎన్నికల్లో తనకు టికెట్ రాకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందానని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీలో తాను చాలా సీనియర్ నాయకుడినని... ఎప్పుడూ ఓడిపోలేదని చెప్పుకొచ్చారు. కానీ గత ఎన్నికల్లో అందరూ కలిసి ఓడగొట్టారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇప్పుడు తనకు టిక్కెట్ ఇస్తే గెలిచేవాడినని ధీమా వ్యక్తం చేశారు. కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించానని...ఆ తర్వాత కరోనాతో వెంటిలెటర్‌పై చికిత్స చేయించుకున్నానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టానని...రెండుసార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడమే తన లక్ష్యమని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.



## మైలర్ దేవ్ పల్లి డివిజన్లో పర్యటించిన తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి విలేజ్ హనుమాన్ దేవాలయం ప్రాంతం లో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను అదే విధంగా దెబ్బతిన్న భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పనులను రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి మరియు హెచ్ ఎం డబ్ల్యూఎస్ ఎస్బి అధికారులతో కలిసి కాలనీ లో పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముందుగా భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ మరమ్మతు పనులు చేసిన అనంతరం నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులకు బస్తి వాసులకు తెలియజేయడం జరిగింది. అనంతరం మరి కింది రోజులలో నూతన భూగర్భ డ్రైనేజ్ పైపులైన్ వ్యవస్థ పనులు కూడా ప్రారంభం అవుతాయని బస్తి వాసులకు తెలియజేయడం జరిగింది. ప్రజలకు ఇబ్బందులు డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించడం జరిగింది. మైలర్ దేవ్ పల్లి డివిజన్ అన్ని రంగాల్లో గ్రేటర్ హైదరాబాద్ లోని ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇంకా డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటానన్ని బస్తీ వాసులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, జిహెచ్ఎంసి అధికారులు డిఇ దివ్య జ్యోతి, ఏఈ నరసింహా మూర్తి, భాను, హెచ్ ఎం డబ్ల్యూఎస్ ఎస్బి లోక్ నాథ్, రావుల భాస్కర్, దేవులపల్లి స్వామి, నోముల పవన్ యాదవ్, బుచ్చి రెడ్డి, ఎల్ వి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివ, రాజు, నిఖిల్, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ హరీష్, భాను, జిహెచ్ఎంసి జవాన్ శేఖర్, విజయ్, ఎస్ఎఫ్ఏ సంగీత, శానిటేషన్ సిబ్బంది దేవాలయ కమిటీ సభ్యులు మరియు బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తారామతిపేట్‌లో భారీ మొసలి కలకలం!

- గ్రామంలోకి చొరబడి 12 అడుగుల మొసలి
- పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

అబ్దుల్లాపూర్ మెట్ మండలం, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తారామతిపేట్ గ్రామంలో భారీ మొసలి దర్శనమివ్వడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గ్రామంలోని కాలువ ద్వారా మూసీ నదిలోంచి వచ్చిన ఈ మొసలి సుమారు 12 అడుగుల పొడవు, 120 కిలోల బరువుతో ఉండటం గమనార్హం.మొసలి గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించిన గ్రామస్తులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, ఫారెస్ట్ అధికారులను అప్రమత్తం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఫారెస్ట్ అధికారులు, పోలీసులు, గ్రామస్థుల సహకారంతో ఆ భారీ మొసలిని సురక్షితంగా బంధించారు. అనంతరం దానిని మూసీ పరిసర ప్రాంతాల్లోని సురక్షిత ప్రాంతానికి తరలించారు.



## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బిజెపినే ప్రధాన అడ్డంకి



- నల్ల రెబ్బనులు ధరించి నిరసన వ్యక్తం చేసిన సిపిఐ.
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

**కురవి, విశాలభారతి:**

బీసి రిజర్వేషన్ల బిల్లు రాకుండా తమ రాజకీయ అవకాశవాద విధానంతో కేంద్ర బిజెపి ప్రభుత్వం మోకలడ్డుతుందని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి విమర్శించారు. సిపిఐ కురవి మండల సమితి ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ల బిల్లు కాకుండా అడ్డుకున్న బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లు ధరించి అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేసి ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకై జన గణన చేసి శాసనసభలో బిల్లు ఆమోదించినా, రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటూ బిల్లు ఆమోదం కాకుండా అడ్డుకుంటు, మరో పక్క రాష్ట్రంలో బీసీలకు తాము మద్దతిస్తున్నట్లు ప్రగల్బాలు పలుకుతూ పలుకుతూ ద్వంద విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి, బిఆర్ఎస్ తమ పదేళ్ల పాలనలో ఏనాడు బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడని వారు, ఈనాడు 42శాతం బిసి బిల్లు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనుకుంటున్నా వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమములో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్, బుడమ వెంకన్న, టి రమేష్, దుదికట్ల సారయ్య, కన్నే వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, నిలుగొండ నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## మానసిక ఆరోగ్యం మంచి సమాజానికి సోపానం

**జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధీరజ్ కుమార్**

**తొర్రూరు, విశాలభారతి:**

మానసిక ఆరోగ్య సంరక్షణ హక్కు మాత్రమే కాదని,బాధ్యతగా తీసుకున్నప్పుడే మంచి సమాజం నిర్మితమవుతుందని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ తెలిపారు.శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు, వైద్యాధికారి డాక్టర్ బి. నందనాదేవిలతో కలిసి జడ్జి మాట్లాడారు.మానవ వికాసానికి మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమని తెలిపారు.మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా కనిపించినా... మానసికంగా బలహీనంగా ఉంటే జీవన గమనం లయ తప్పుతుందన్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యం సరిగా లేకుంటే నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ మానసిక రుగ్మతతో బాధపడేవారు తప్పనిసరిగా వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మీరాజ్ ,డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మానస,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల చేయాలి



**తొర్రూరు, విశాలభారతి:**

బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదువుకునే విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘ నాయకులు ఈదురు ఐలయ్య కోరారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని విశ్రాంతిభవనంలో శుక్రవారం బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదురు ఐలయ్య మాట్లాడుతూ.. బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదువుకుంటున్న ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులకు విద్యను అందించేందుకు పాఠశాల యాజమాన్యాలు ముందుకు రావడం లేదని, ఏడాదికి డే స్కాలర్‌కు రూ.28 వేలు, రెసిడెన్షియల్ కింద రూ.42 వేలచొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కార్పొరేట్ విద్యాసంస్థలు భోజనం, దుస్తులు, పుస్తకాలు, వసతి వంటి సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావడం లేదన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని దళిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం చేయూత అందించకపోతే చదువు మధ్యలోనే ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల బకాయిల చెల్లించి ఎస్సీ విద్యార్థుల విద్య సజావుగా సాగేలా చూడాలని, లేనిపక్షంలో ఆందోళనలను చేపడతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ధర్మారపు వేణు,మాంకాళి సాయిమల్లు,దండంపెల్లి సైదులు, వేల్పుల ఐలయ్య, దూల వెంకన్న, యాకయ్య, బందు యాకయ్య, ఐలపాక వెంకన్న, వెంకన్న,నాగేష్ రవి, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## భౌతికదేహానికి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలం,కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన దుద్దుల సాయిమల్లు (70) గౌడ్ నిన్న సాయంత్రం మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లబోయిన గిరి యాదవ్. వారి వెంట గ్రామ కార్యదర్శి తాల్లపెల్లి మహేష్,మాజీ సర్పంచ్ చింత సోమయ్య,మాజీ ఉప సర్పంచ్ మరాఠీ క్రిష్ణ, గ్రామ బీఆర్ఎస్ నాయకులు బిల్లా యాదవ రెడ్డి,ఓడపల్లి రవి, చింత పరుశరాములు, బెజాటి సోమయ్య, మోలుగురి మహేష్, కంచర్ల భాస్కర్,తదితరులున్నారు.

## కర్రతో కొట్టిన వ్యక్తికి రిమాండ్

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలం గోపియా నాయక్ తండాకు చెందిన బానోత్ రమేష్ అనే వ్యక్తిని సెప్టెంబర్ 5 శుక్రవారం రోజున బానోత్ రాహుల్ అనే వ్యక్తి కర్రతో కొట్టగా అతని చెయ్యి విరిగింది అని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ కూర సృజన్ కుమార్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. తద్వారా బానోత్ రాహుల్ పై కేసు నమోదుతో అరెస్టు చేసి దర్యాప్తు అయిన తర్వాత ఈరోజు రిమాండ్ కు తరలించగా, జనగామ కోర్ట్ అతనికి 8 రోజుల రిమాండ్ విధించిందని ఎస్ఐ ఊర సృజన్ కుమార్ తెలిపారు.




## ప్రైవేట్ పాఠశాలల ట్రస్మా అసోసియేషన్ కార్యాలయం

**ఆర్మూర్, విశాలభారతి:**

నందిపేట్, డొంకేశ్వర్ మండలాల ట్రస్మా అసోసియేషన్ కార్యాలయాన్ని శుక్రవారం నందిపేట్ మండల కేంద్రంలో అధ్యక్షులు చుక్కాబొట్ల దేవన్న అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారి అవధూత గంగాధర్, డొంకేశ్వర్ మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ చేతుల మీదుగా ట్రస్మా కార్యాలయాన్ని ప్రారంభించారు. ట్రస్మా కార్యాలయం ప్రారంభం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ అధ్యక్షులు శ్రీ రాస నిత్యానందం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పండ్ల,రమేష్, జిల్లా జనరల్ సెక్రెటరీ గోజూరి అరుణ్ కుమార్, కోశాధికారి మధు, ట్రస్మా నందిపేట్ మండల ప్రధాన కార్యదర్శి సన్నీ కోశాధికారి తోట మురళి, మరి ఉమ్మడి మండలాలకు చెందిన ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## పిఆర్టియు టిఎస్ నూతన అధ్యక్షులుగా గోలి తిరుపతిరెడ్డి

**దేవరుప్పుల, విశాలభారతి:**

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ దేవరుప్పుల మండల శాఖ నూతన కమిటీ ఈరోజు ప్రాథమిక పాఠశాల సింగరాజుపల్లిలో మండల శాఖ అధ్యక్షులు అంబటి అంజయ్య గారి అధ్యక్షతనతొ నిర్వహించి, నూతన అధ్యక్షులుగా గోలి తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓడపల్లి ప్రవీణ్ కుమార్, గారిని ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సర్వసభ్యసమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అంబటి ఆంజయ్య పదోన్నతిపై నిదిగొండ ఉన్నత పాఠశాలకు వెళ్ళగా నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జనగామ జిల్లా శాఖ అధ్యక్షులు కొల్ల మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిస్కారం కేవలం పిఆర్ టియు తోనే సాధ్యమని, పాత పెన్షన్ పునరుద్ధరణ,పెండింగ్ డి.ఏ.లు,పిఆర్ సి సాధన తో పాటు,ఆరోగ్య కార్డులను అందించుటకు కృషి చేస్తామని, ఉపాధ్యాయులు హక్కులతో పాటు విధులు సక్రమంగా నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లా రెడ్డి, రాష్ట్ర బాధ్యులు లక్ష్మణ్ రావు,సోమరాజు, శ్రీనివాస్, శోభారాణి, మెతుకు రాజు, జ్యోతి, సుహాసిని, కిరణ్కుమార్, దిలీప్ రెడ్డి, ఖాజా, చంద్రశేఖర్, పాండ్య ఆంజనేయులు, శివ కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.




## మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి చేయూత

**తొర్రూరు, విశాలభారతి:**

తొర్రూర్ మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన అతిక్‌ఫాతిమా దంపతుల రెండవ కుమార్తె అతియ తరుణం తండ్రి అతిక్ గుండెపోటుతో మరణించాడు.పట్టుదలతో అతియ నీట్ 2025లో కాకతీయ మెడికల్ కాలేజీలో మెడిసిన్ సీటు సాధించిన నిరుపేద ఎస్సి కుటుంబానికి చెందిన విద్యార్థినికి లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన రూ.45,100 రూపాయలను శుక్రవారం పిడిజి లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, డిస్టిక్ జి ఎల్ టి కోఆర్డినేటర్ లయన్ వేలూరు శారద,ఆర్ సి దామెర సరేష్ ల సమక్షంలో నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సేవా తరుణి సభ్యులు పేద మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించడం అభినందనీయమని,ఇలానే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. అమ్మాయికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. పేద విద్యార్థిని గురించి క్లబ్ కు తెలిపిన నాగవాణి, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థినికి కృషి బట్టల షాప్ నిర్వాహకులు చక్రపాణి రెండు జతల డ్రస్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి, లయన్ ఉమా రెడ్డి, లయన్ సబిత, లయన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## గుడిలో చొరబడిన పాము

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల వేణుగోపాలస్వామి దేవాలయం లోకి పాము వచ్చింది. జగన్నాథ మందిరం తలుపులు తెరవగానే పూజారి వరదాచార్యులుకి పాము కనిపించింది. అయన వెంటనే స్నేక్ సొసైటీ సభ్యులకు వెంటనే సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చారు. పామును చాకచక్యంగా పట్టుకొని అడవిలో వదిలారు. పెద్దగా ఉన్న పాములు జెర్రీపోతుగా గుర్తించారు. అయినా పాములు కనిపిస్తే వాటిని చంపకుండా వెంటనే స్నేక్స్ సొసైటీ సభ్యులకు 83742 33366 వెంటనే ఫోన్ చేయాలని కోరారు.



## రాష్ట్ర చికెన్ సెంటర్ అసోసియేషన్ సభ్యుల సమావేశం

- సిండికేట్‌గా మారిన కోళ్ల ఫారం యజమానులు
- చికెన్ సెంటర్ యజమానులకు గండి

**బోడుప్పల్, విశాలభారతి:**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బొమ్మ బాలయ్య ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర చికెన్ సెంటర్ అసోసియేషన్ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. చేశారు.చికెన్ సెంటర్ నిర్వాహకులు సంజీవరెడ్డి, శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చికెన్ సెంటర్ తో ఎన్నో వందలాది కుటుంబాల జీవిస్తున్నాయని కానీ ఈరోజు ఆ చికెన్ సెంటర్లే భారంగా మారాయని అన్నారు. 26 కోళ్ల ఫారం కంపెనీలు కలిసి సిండికేట్ గా ఏర్పడి కమిటీలు వేసుకొని వారంతట వారే సొంత నిర్ణయాలు తీసుకొని లైవ్ చికెన్ ని సప్లై చేసే సెంటర్లకు ఎలాంటి గిట్టుబాటు ధర లేకుండా సప్లై చేస్తున్నారని, దానివలన చిన్న చిన్న చికెన్ సెంటర్ యజమానికి ఎలాంటి రాబడి లేక పేపర్ ధరకే చికెన్ ని అమ్మడం వలన చాలా వరకు నష్టపోతున్నారని షాప్ రెంట్లు కానీ జీతభత్యాలు ఇలా ప్రతి విషయంలో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పోలిస్తే 50% తగ్గిందనీ,తమకి గతంలో ఉన్న మార్జిన్ ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.కావున కోళ్ల ఫారం యజమానులు మా ఆర్థిక పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని మార్జిన్ అమౌంట్ విషయం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి చికెన్ సెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్, ఉపాధ్యక్షులు నరేష్ ,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రామంతపూర్ అధ్యక్షులు వరుణ్ యాదవ్, ఉపాధ్యక్షులు ఎస్కే జాకీర్, సలహాదారులు మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీజేపీ నేత రాజుశెట్టి జన్మదిన వేడుకలు

- **వేడుకల్లో పలు సేవా కార్యక్రమాలు**
- **అన్నదానం,పండ్లు, పుస్తకాలు పంపిణీ**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

బీజేపీ సీనియర్ నాయకుడు రాజు శెట్టి కురుమా జన్మదిన వేడుకలు శుక్రవారం పలు సామాజిక సేవ కార్యక్రమలతో విశిష్టంగా జరుపుకున్నారు. అందులో భాగంగా సురభి కాలనీలోని ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి ,విద్యా ప్రాధాన్యతను రాజు శెట్టి వివరించారు.జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి శాలువాతో సత్కరించి, వారితో కలిసి భోజనం చేశారు.ఏ మేరకు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బంది సమాజ శుభ్రత కోసం వారు చేస్తున్న కష్టసాధ్యమైన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పరిసరాల పరిశుభ్రతలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని రాజు శెట్టి కురుమా వారి సేవలను కొనియాడారు.వారి సేవలను గుర్తించి,గౌరవిస్తూ వారిపై పూలవర్షం కురిపించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రమేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు భిమాని కిశోర్,ఉపాధ్యక్షురాలు కౌసల్య, కార్యదర్శి సిద్ధు,బాలరాజు, శ్రీకాంత్, మీన,లక్ష్మి, భరగవ్, కల్యాణ్, రాణి, మల్లేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాపర్టీ షో పేరుతో వెలవెల బోయిన ప్రదర్శన



- **నారెడ్కో వేదికపై బిల్డర్లకు చల్లని షాక్**
- **ముఖ్యఅతిథిలుగా పాల్గొని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన నారెడ్కో తెలంగాణ 15వ ప్రాపర్టీ షో ఆశించిన రీతిలో సాగలేదు.ఇవి మీ సొంతింటి శుభ ఘడియలు ట్యాగ్‌లైన్‌తో నిర్వహించిన ఈ షో మొదటి రోజే బిల్డర్లకు చల్లని షాక్ ఇచ్చింది. వేదిక మొత్తం వెలవెలబోయి కనిపించగా, ప్రజల రాక తగ్గిపోవడంతో బిల్డర్లు, డెవలపర్లు నిరుత్సాహానికి గురయ్యారు. ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారన్న ప్రచారం ముందుగా ఉండగా,చివరికి ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాత్రమే పాల్గొన్నారు.హైటెక్స్ ప్రాంగణంలో సీఎం ఫ్లెక్సీలు కనిపించకపోవడం గమనార్హం.సరైన ప్రచారం లేకపోవడం,కొనుగోలు దారుల్లో ఆసక్తి తగ్గిపోవడం వల్ల స్టాళ్లు ఖాళీగా కనిపించాయి. సుమారు 80కి పైగా బిల్డర్లు, డెవలపర్లు తమ ప్రాజెక్టులు ప్రదర్శించినా ఆత్మవిశ్వాసం కంటే ఆందోళన ఎక్కువగా కనిపించింది. ఇటీవల రాయదుర్గం పాన్‌మక్తా ప్రాంతంలో ఎకరా భూమి రూ.177 కోట్లకు వేలంలో అమ్ముడైన నేపథ్యంతో, ఈ షోకు భారీగా రద్దీ ఉంటుందని నిర్వాహకులు ఆశించారు. అయితే ఆ అంచనాలు ఫలించలేదు. డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ భాగ్యనగరం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. రియల్‌ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం అన్ని రకాల మద్దతు అందిస్తుంది. బిల్డర్లకు అనుమతులను డిజిటల్ విధానంలో సులభతరం చేస్తాం. మూసీ రివర్‌ను గాంధీ సరోవర్‌గా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి. నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాం అని తెలిపారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందు నేనే బిల్డర్. రియల్ఎస్టేట్ రంగం తెలంగాణ అభివృద్ధికి వెన్నెముక. ఈ రంగానికి అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తుంది"అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ సాయి మేక, జెనరల్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పీఎస్ రెడ్డి, ఎం. వెంకయ్య చౌదరి, పి. రవిరెడ్డి, స్వామినాథన్, కాళీ ప్రసాద్, వెంకటేష్, హరిబాబు, దశరథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కళాశాలలో భారీ చోరీ

- **కళాశాల ఆఫీస్‌లో దొంగల ముటాలు**
- **కోటి రూపాయల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు**

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి చెందిన బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో భారీ దొంగతనం సంచలనం రేపింది. పోలీసులు వివరాల ప్రకారం..కాలేజ్ ప్రిన్సిపల్ వులిగడ్డ వీరన్న (61 ) పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. తాను అక్టోబర్ 9న సాయంత్రం 6 గంటల సమయంలో కాలేజ్ పనులు ముగించుకుని గేటు లాక్ చేసి ఇంటికి వెళ్లారని తెలిపారు.తదుపరి రోజు అక్టోబర్ 10న ఉదయం 8.45 గంటలకు కాలేజ్ అకౌంట్స్ ఆఫీసర్ కేశినేని కుమార్ ఫోన్ చేసి ఆఫీస్ రూమ్ తాళం విరగబడి ఉందని సమాచారం ఇచ్చారు. వెంటనే కళాశాలకు చేరుకున్న ప్రిన్సిపల్ వీరన్న ఆఫీస్ రూమ్‌లో తాళాలు పగులగొట్టబడినట్టు, అల్మారా తలుపులు ధ్వంసమైనట్టు గమనించారు.తదుపరి పరిశీలనలో కళాశాల విద్యార్థుల ఫీజు రూపంలో ఉన్న సుమారు రూ. 10,70,000 నగదు దొంగిలించబడినట్టు గుర్తించారు. సిబ్బంది సమాచారం మేరకు మొత్తం నగదు దొంగిలించబడినట్లు పోలీసులు ధృవీకరించారు. ఫిర్యాదు స్వీకరించిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనంలో పాల్పడిన నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించి విచారణ కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది అని ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## పటేల్ చెరువు కాలువ నిర్మాణ పనుల పరిశీలన

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు నుండి చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు వరకు నూతనంగా చేపడుతున్న వరద నీటి కాలువ నిర్మాణం పనులను ఎస్ఎన్డిపి అధికారులు, చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలసి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పటేల్ చెరువు నుండి గంగారం చెరువు వరకు, వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కొరకై చేపట్టిన వరద నీరు కాల్వ నిర్మాణం పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పనులను పూర్తిచేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని అధికారులను కోరారు.పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు తెలపారు. మియాపూర్,



చందనగర్ డివిజన్ల పరిధిలోని చుట్టుపక్కల కాలనీ వాసులకు ఎంతో మంది ప్రయాణికులకు, వాహనదారులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు, మియాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం పిఎసి చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలకు అన్ని రకాల మౌళికవసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.మౌళికవసతులు కల్పించడంలో ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎన్డిపి డి,ఈ ధీరజ్, స్థానిక నాయకులు సందీప్ రెడ్డి, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్

- **ప్రధాన అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

హయత్‌నగర్ గ్రామంలో భక్తి శ్రద్ధలతో జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బొడ్రాయి ఊరేగింపు వేడుకకు ప్రజలు, భక్తులు భారీగా హాజరయ్యారు.ఈ సందర్భంలో ముఖ్య అతిథులుగా మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని బొడ్రాయి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఎంపీ ఈటల రాజేందర్ అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ ఉత్సవాలు ప్రజల ఏకతను, భక్తిని ప్రతిఫలింపజేస్తున్నాయని అన్నారు.



## రోడ్లకు మరమ్మతులు

**పరిశీలించిన సూపర్‌డెంట్ ఇంజనీర్ శంకర్ నాయక్**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలు మాయంగా మారాయి. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం సిద్ధమైంది.అందులో భాగంగా జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులు జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేశారు. శేరిలింగంపల్లి జోన్ ఎస్ఈ శంకర్ నాయక్ పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఆకలి తీర్చేందుకే 'ఇందిరమ్మ క్యాంటీన్'



- **కూకట్‌పల్లిలో కాంగ్రెస్ నేతల భోజన పరిశీలన**
- **ఆహార నాణ్యత, రుచిపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు**

**కూకట్‌పల్లి, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ క్యాంటీన్'లో పేదలకు అందుతున్న భోజనం నాణ్యత, రుచిని కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు క్యాంటీన్‌ను సందర్శించి స్వయంగా భోజనం చేశారు. పప్పు, కర్రి, పచ్చడి తో భోజనం రుచిగా ఉన్నట్లు నేతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అక్కడ భోజనం చేస్తున్న స్థానికులతో నేతలు మాట్లాడి, ఆహారం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం మాత్రమే అందిస్తున్నారు. రూ.5 చెల్లించి పేదలు కడుపునిండా భోజనం చేస్తున్నారు. ఒక భోజనం పూర్తి ఖరీదు రూ. 29.83 కాగా, ఇందులో లబ్ధిదారుడు రూ.5 చెల్లిస్తుండగా, మిగిలిన రూ. 24.83ను జీహెచ్ఎంసీ (GHMC) సబ్సిడీ రూపంలో భరిస్తోంది. భోజనం నాణ్యత, రుచి చాలా బాగున్నాయని, ఇంత తక్కువ ధరలో మంచి ఆహారం దొరకడం సంతోషంగా ఉందని స్థానికులు నేతలకు తెలిపారు. ప్రజల నుంచి సానుకూల స్పందన రావడంతో నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం, ఆకలి తీర్చాలనే సంకల్పంతోనే ఈ ఇందిరమ్మ క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేద ప్రజల శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ నాయుడు,114 డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్,115 డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్‌పుత్, మేకల మైకల్,AMC డైరెక్టర్ ఫణీంద్ర, డివిజన్ సీనియర్ నాయకులు రాజేష్ గౌడ్, కృష్ణారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**రాజేంద్రనగర్, విశాలభారతి**

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి మీద దాడి చేయడం అంటే న్యాయ వ్యవస్థ మీద రాజ్యాంగ స్ఫూర్తి మీద దాడి చేయడమే. దాడి ఘటనను సుమోటోగా తీసుకొని అడ్వకేట్ రాకేష్ కిషోర్ ని తక్షణమే అరెస్ట్ చేయాలి. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలనీ చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడికి నిరసనగా 10 రోజుల పాటు దేశవ్యాప్తంగా నిరసన ఆందోళనలకు సిద్ధం కావాలి రాజ్యాంగం పట్ల లోతైన అవగాహన సామాజిక న్యాయం పట్ల స్పష్టత కల్గిన ఎన్నో చారిత్రాత్మకమైన తీర్పులు వెల్లడించి రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టుతున్న న్యాయ కోవిదుడు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి మీద సుప్రీంకోర్టులో కేసుపై విచారణ జరుగుతున్న సందర్భంగా దాడి చేయడం అంటే న్యాయ వ్యవస్థ మీద రాజ్యాంగ స్ఫూర్తి మీద ప్రజాస్వామ్య విలువల మీద దాడి చేయడమేనని, ఈఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని అడ్వకేట్ రాకేష్ కిషోర్ ని తక్షణమే అరెస్టు చేయాలని ఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ల బాబు మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసారం శంకరరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ, ఎంఎస్పీ మండల ఇంచార్జి కొత్తూరు రమేష్ మాదిగ, మున్సిపాలిటీ అధ్యక్షులు చిన్నగండు భాస్కర్ మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

- **మానసిక ఆవేదనతో ఆత్మహత్య**
- **ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యూనికార్పస్ వర్డ్ అండ్ డీడ్ హాస్పిటల్ క్యాంపస్‌లో ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గండమల్ల వసంత (40 ) అనే మహిళ తన నివాసమైన వర్డ్ అండ్ డీడ్ క్యాంపస్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలోని ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన 2025 అక్టోబర్ 9న మధ్యాహ్నం 1 గంట సమయంలో జరిగింది. తక్షణమే కుటుంబ సభ్యులు ఆమెను అదే క్యాంపస్‌లోని యూనికార్పస్ వర్డ్ అండ్ డీడ్ హాస్పిటల్‌కి తరలించగా, వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ అక్టోబర్ 10వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో వసంత మరణించిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.ప్రాథమిక విచారణలో వసంత భర్త గండమల్ల జయరాజు అదే సంస్థలో స్వీపర్‌గా పనిచేస్తున్నట్లు, దంపతులు సంస్థ పరిధిలోని క్వార్టర్స్‌లో నివసిస్తున్నట్లు తేలిందని ఆయన చెప్పారు. మృతురాలు కొంతకాలంగా మానసిక ఆవేదనతో బాధపడుతూ ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందిందని తెలిపారు.

## ఘనంగా ముగిసిన జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్

**బాటసింగారం జెడ్‌పీహెచ్ఎస్‌లో 69వ ఎస్‌జిఎఫ్ఐ క్రీడా పోటీలు**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్ జోన్ పరిధిలోని జెడ్పిహెచ్ఎస్ బాటసింగారం పాఠశాలలో నిర్వహించిన 69వ ఎస్‌జిఎఫ్ఐ (SGFI) జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్ పోటీలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో హయత్‌నగర్ జోనల్ సెక్రటరీ ఏ. నిర్మల మాట్లాడుతూ, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల నుండి అండర్ 14 మరియు అండర్ 17 విభాగాల్లో బాలురు, బాలికలు కలిపి మొత్తం 1500 మంది క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. ఒకే జోన్ స్థాయిలో ఇంత పెద్ద స్థాయిలో క్రీడాకారులు పాల్గొనడం ఇదే మొదటిసారి అని ఆమె పేర్కొన్నారు. క్రీడాకారులకు పీడీ లకు భోజనం, వసతి వంటి సౌకర్యాలను సమకూర్చడంలో విశేష పాత్ర పోషించిన మేజర్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరేష్, జెడ్పిహెచ్ఎస్ బాటసింగారం పీడీ సొలపోగుల స్వాములు, పీడీలు జగన్మోహన్ రెడ్డి, చంద్రమోహన్, రూబీ వెంకటేశ్వర్లు, నరసింహా రావు, ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్, అలాగే ఉపాధ్యాయ బృందానికి హయత్‌నగర్ జోనల్ వ్యాయామ ఉపాధ్యాయుల తరపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



## హైకోర్టు స్టేకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి:**

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ రిజర్వేషన్లపై స్టే విధించడం పట్ల.. కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ అన్నారు.చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈరోజు ఓబీసీలు ఎదుర్కొంటున్న దురవస్థకు కారణమని రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు. బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి, న్యాయపరమైన లొసుగులను సరిచేసుకోవాలని రవి ప్రసాద్ గౌడ్ డిమాండ్ తెలిపారు. ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపినప్పటికీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని రవి ప్రసాద్ గౌడ్ విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం గవర్నర్‌కు పంపిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ గడువు పూర్తికాకముందే ప్రభుత్వం తొందరపడి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు.



## బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేని పాలక పార్టీలు



- **ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ ఆగ్రహం**
- **షెడ్యూల్ తొమ్మిదిలో బీసీ రిజర్వేషన్లను చేర్చి చట్టబద్ధత కల్పించాలి**

**పెద్ద అంబర్‌పేట్, విశాలభారతి:**

బీసీ రిజర్వేషన్ల విషయంలో పాలక పార్టీలకు చిత్తశుద్ధి లేదని, అందుకే హైకోర్టు బీసీ రిజర్వేషన్లపై స్టే విధించిందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ ఆరోపించారు. బీసీలకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించాలంటే బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చడం తప్ప మరో మార్గం లేదని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంపై స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జబ్బర్ నాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నా, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తగిన చట్టపరమైన చర్యలు తీసుకోకుండానే జీవో 9 ద్వారా త్వరితగతిన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిందని, దాంతోనే హైకోర్టు స్టే విధించిందని విమర్శించారు.అగ్రవర్ణాలకు ప్రాధాన్యత ఇస్తూ, ఉత్పత్తి రంగంలో కీలక పాత్ర పోషించే బీసీలను నిర్లక్ష్యం చేయడం తీవ్ర అన్యాయమని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజకీయ లబ్ధి సాధనకే ఉపయోగించుకుంటున్నారని, కానీ చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరసింహులు, సదానందం, బాల్ సింగ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
శనివారం
11 అక్టోబర్ 2025
CINEMA

# హాట్ ఫొటోస్‌తో గిలిగింతలు



నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగుతెరకు పరిచయమైంది అందాల భామ నభా నటేష్ మొదటి సినిమాలో అల్లరిపిల్లగా కనిపించి తెలుగు ప్రేక్షకుల దృష్టిలో బాగానే పడింది. ఈ సినిమా తరువాత అమ్మడు ఇస్మార్ట్ శంకర్ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్ గా మారింది. తెలంగాణ పోరి చాందినీగా నభా నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా తరువాత ఈ చిన్నదాన్ని ఎవరు ఆపలేరు అనుకున్నారు. కానీ, అన్ని అనుకున్నట్లు జరిగితే జీవితం అవ్వదు కదా. అలాగే నభాకు అవకాశాలు వచ్చాయి కానీ, ఆశించిన గుర్తింపు మాత్రం దక్కలేదు.2021 తరువాత ఈ చిన్నది వెండితెరపైనే కాదు ఇండస్ట్రీలో కూడా ఎక్కడా కనిపించలేదు. ఒక పెద్ద యాక్సిడెంట్.. దాని నుంచి కోలుకోవడానికి సమయం తీసుకున్నట్లు చెప్పకొచ్చింది. ఇక రీఎంట్రీలో సినిమాలతో బిజీగా ఉంటుంది అనుకుంటే ఫోటోషూట్స్ తో సోషల్ మీడియాలో యుద్ధం ప్రకటించింది. నిత్యం హాట్ హాట్ ఫొటోస్ తో కుర్రకారుకును గిలిగింతలు పెడుతూ వారి కంటికి కునుకే లేకుండా చేస్తుంది.

# సువ్వి సువ్వి సువ్వాలా..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ఓజీ. డీవీవీ ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య నిర్మించాడు. ఇక ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటించగా.. ప్రకాష్ రాజ్, శ్రేయ రెడ్డి, అర్జున్ దాస్ కీలక పాత్రల్లో నటించారు. ఎన్నో అంచనాల నడుమ సెప్టెంబర్ 25 న ఓజీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అభిమానులు ఆశించనట్లుగానే ఓజీ భారీ విజయాన్ని అందుకుంది. పవన్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ను అందుకుంది. రూ. 300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ఇండస్ట్రీని షేక్ చేసింది. పవన్ అభిమానులు ఆయనను ఎలా చూడాలనుకున్నారో సుజీత్ అలానే చూపించి వారి ఆకలి తీర్చాడు. ఓజాస్ గంభీరగా పవన్ అదరగొట్టేశాడు. ఇంకా ఓజీ థియేటర్ లో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతుంది.తాజాగా ఈ సినిమాలోని ఒక్కో వీడియో సాంగ్ ను రిలీజ్ చేస్తూ మేకర్స్ అభిమానులను అలరించడానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగా మొదటగా ఓజీలోని రొమాంటిక్ లవ్ సాంగ్ సువ్వి సువ్వాలాను రిలీజ్ చేశారు. సినిమా మొత్తం ఒక ఎత్తు అయితే.. ప్రియాంక మోహన్ ఉన్నంతసేపు మరో ఎత్తు అని చెప్పుకోవచ్చు. కన్మణిగా ఆమె ఆ పాత్రలో అదరగొట్టేసింది.ఇక ఈ వీడియో సాంగ్ లో పవన్ వింటేజ్ లుక్ నెక్స్ట్ లెవెల్ అని చెప్పొచ్చు. ఎంతో ప్లజెంట్ గా.. లవ్ మోడ్ లో ఎంతో అందంగా కనిపిస్తాడు. వీరిద్దరి జోడి మంచి ప్రశంసలను అందుకుంది. కళ్యాణ్ చక్రవర్తి అందించిన లిరిక్స్ ను శృతి రంజని తన అద్భుతమైన గొంతుతో మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం ఈ సాంగ్ నెట్టింట వైరల్ గా మారింది.

# ఓటీటీలోకి 'కిష్కింధపురి'..



యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. ఈ సినిమాకు కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం మిరాయ్‌కి పోటీగా సెప్టెంబర్ 12న వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో ఈ సినిమా అక్టోబర్ 17 నుంచి తెలుగులో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు దీపావళి కానుకగా అక్టోబర్ 19న ఈ చిత్రం టెలివిజన్ జీ తెలుగులో సాయంత్రం 6 గంటలకు ప్రసారం కాబోతున్నట్లు నిర్వహాకులు వెల్లడించారు.సినిమా కథ విషయానికి వస్తే.. రాఘవ్ (బెల్లంకొండ సాయి శ్రీనివాస్), మైథిలి (అనుపమ) ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌస్ టూర్స్ నిర్వహిస్తుంటారు. అలా 11 మందితో కలిసి పాడుబడిన సువర్ణమాయ రేడియో స్టేషన్‌కి వెళ్తారు. అక్కడ వేదవతి అనే ఆత్మ వాయిస్ వినిపిస్తుంది. లోపలికొచ్చిన వారందరినీ వదిలిపెట్టనని హెచ్చరిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అసలు వేదవతి ఎవరు? ఎందుకు ఆత్మగా మారింది? సువర్ణమాయ నుంచి బయటపడటానికి రాఘువ్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడనేది మిగతా కథ.

# బాలయ్య అఖండ తాండవం

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటిస్తున్న అవైటెడ్ సాలిడ్ డివోషనల్ డ్రామానే అఖండ 2 తాండవం. తన హిట్ మెషిన్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కించిన ఈ అవైటెడ్ చిత్రం పాన్ ఇండియా లెవెల్లో దుమ్ము లేపేందుకు వస్తుంది. అయితే ఈ సినిమాతో బాలయ్య తన మొదటి 100 కోట్ల మార్కెట్ ని టచ్ చేసినట్టుగా తెలుస్తుంది. అయితే ఇది వరకే బాలయ్యకి వరుస 100 కోట్ల గ్రాసర్ లు ఉన్నాయికానీ ఇది వసూళ్ల కోసం కాదు తన బిజినెస్ కోసం. అఖండ 2 తో థియేట్రికల్ గా బాలయ్య మార్కెట్ 100 కోట్ల మార్క్ దాటేసినట్టు తెలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా అఖండ 2 కి 100 కోట్లకి పైగానే అన్ని భాషల్లో కలుపుకొని బిజినెస్ జరిగినట్టు తెలుస్తుంది. దీనితో బాలయ్య మొదటి 100 కోట్ల షేర్ సినిమా కూడా దీనితోనే మొదలు కానుంది అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా ఈ డిసెంబర్ 5న గ్రాండ్ గా రిలీజ్ కి తీసుకొస్తున్నారు.



# నాకోసం ఎవరూ రారని తెలుసు


మోహన్‌బాబు కూతురు, నటి మంచు లక్ష్మీకి ఓ వెబ్ మీడియాలో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ వేదుల మూర్తి క్షమాపణ చెప్పారు. ఆ వ్యక్తి తనకు క్షమాపణ చెప్పడానికి మూడు వారాలు సమయం పట్టిందని మంచు లక్ష్మి కాస్త అసహనం వ్యక్తం చేశారు. తన సినిమా దక్ష ప్రమోషన్‌లో భాగంగా మూర్తి అనే యాంకర్ లక్ష్మీని ఇంటర్వ్యూ చేయగా ఆమె ధరించే దుస్తుల గురించి ఓ ప్రశ్న అడగగా ఆమె మనసు నోచ్చుకుంది. దాంతో ఆమె 'మా' అసోసియేషన్, ఫిల్మ్ ఛాంబర్‌ను ఆశ్రయింది సదరు జర్నలిస్ట్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దాంతో మూడు వారాల తర్వాత లక్ష్మీని క్షమాపణ కోరుతూ మూర్తి ఓ లేఖ, వీడియో విడుదల చేశారు. దీనిపై మంచు లక్ష్మి స్పందించారు. 'ఆ వ్యక్తి క్షమాఫణ చెప్పడానికి మూడు వారాలు పట్టింది. ఈసారి నేను మౌనంగా ఉండాలనుకోలేదు. నా తరపున ఎవరూ నిలబడరని నాకు తెలుసు. అందుకే నాకోసం నేనే పోరాటం చేశా. ఈ చేదు అనుభవం నన్ను ఎంతగానో గాయపరచింది. నాకు కావల్సింది నిజాయతీ గల క్షమాపణ, జవాబుదారీతనం' అని పేర్కొన్నారు మంచు లక్ష్మి. 'ఇలాంటి చిన్న చిన్న విషయాలే ఆడవాళ్ల గొంతు మూగబోకుండా కాపాడతాయి. నాకంటే ముందు ధైర్యంగా మాట్లాడిన ఆడవాళ్ల వరుసలో నేను నిలబడి ఉన్నా అదే నాకు ఈరోజు ధైర్యాన్ని ఇచ్చింది. పత్రికా రంగం, జర్నలిస్ట్‌లపై నాకు గౌరవం ఉంది. ప్రజలకు నిజం చెప్పడానికి తమ ప్రాణాల్ని సైతం ఫణంగా పెడతారు. ఈ సమాజానికి వెలుగునిచ్చే దీపాల్లాంటివారు. కానీ ఆ శక్తిని అవసరమైన చోట కాకుండా వ్యక్తిగత దాడుల కోసం ఉపయోగించినప్పుడు ఎంతో బాధ కలుగుతుంది. నేను ఈ విషయాన్ని ఇంతటితో ప్రశాంతంగా ముగిస్తున్నా' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.





# విశ్వక్ సేన్ 'ఫంకీ' టీజర్ రిలీజ్..

టాలెంటెడ్ యాక్టర్ విశ్వక్ సేన్ హీరోగా, 'జాతిరత్నాలు' ఫేమ్ డైరెక్టర్ అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా సినిమా 'ఫంకీ'. కామెడీ, ఎంటర్టైన్‌మెంట్ మిక్స్‌తో రూపొందుతోన్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి ఆసక్తి ఏర్పడింది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు, అందులోని ఫన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటించగా, సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మాణం వహిస్తున్నారు.ఫంకీ' టీజర్ చూస్తుంటే, విశ్వక్ సేన్ ఓ సినిమా డైరెక్టర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్ కాయదు అతని సినిమా హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య సాగే లవ్ స్టోరీకి అనుదీప్ మార్క్ హాస్యం మేళవించి సినిమాను పూర్తిగా ఫన్ రైడ్‌గా మలిచినట్లు స్పష్టమవుతుంది. డైలాగ్స్, క్యారెక్టరైజేషన్, బాడీ లాంగ్వేజ్ అన్నీ కలిసి టీజర్‌ను హిలేరియస్‌గా మార్చేశాయి.



# నా కోసం నా జీవితాన్ని ప్లాన్ చేసేవారితోనే పెళ్లి

ఇండస్ట్రీ.. ఒక రంగుల ప్రపంచం. ఇక్కడ పైకి కనిపించేవి ఏవి నిజం కాదు. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో అయితే అస్సలు కాదు. వారిపై వచ్చే పుకార్లు అయితే నమ్మడమే చాలా కష్టం. ఈ రూమర్స్ ను కొందరు హీరోయిన్లు సీరియస్ గా తీసుకొని కుమిలి కుమిలి ఏడుస్తారు. ఇంకొందరు మాత్రం ఎంచక్కా నవ్వుకొని.. తిరిగి వాటిపై సెటైర్లు కూడా వెస్తూ ఉంటారు. స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ప్రస్తుతం అలాంటి సెటైర్ నే వేసింది. తన పెళ్లిపై వస్తున్న పుకార్లను ఒక్క సెటైరికల్ పోస్ట్ తో చెక్ పెట్టింది.వర్షం సినిమాతో తెలుగుతెరకు పరిచయమైంది త్రిష. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకొని తెలుగులో వారు వీరు అని తేడా లేకుండా అందరి హీరోల సరసన నటించి స్టార్ హీరోయిన్ గా మారింది. ఇక కొత్త హీరోయిన్లు రావడంతో ఉన్నప్పడే ముద్దగుమ్మ నెమ్మదిగా ఇండస్ట్రీ నుంచి తప్పకుంది. ఆ తరువాత తమిళ్ లో లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ గా ఛాయిస్ గా మారింది. చాలా గ్యాప్ తరువాత త్రిష విశ్వంభర సినిమాతో టాలీవుడ్ లో రీఎంట్రీ ఇస్తుంది. ఇక త్రిష పెళ్లి ఎప్పుడు మిస్టరీనే అని చెప్పొచ్చు. గతంలో ఒక బిజినెస్ మ్యాన్ తో ఎంగేజ్ మెంట్ జరుపుకొని పెళ్లి కొన్ని రోజుల్లో ఉంది అనుకొనేలోపు రద్దు చేసుకుంది. అప్పటి నుంచి సింగిల్ గా ఉంటున్న త్రిష.. ఈ మధ్యనే హీరో విజయ్ తో ప్రేమాయణం నడుపుతుందని వార్తలు వచ్చాయి. వీరిద్దరూ కలిసి కనిపించడం ఆ వార్తలు నిజమే అని అనుకునేలా చేశాయి. అయితే ఈలోపే త్రిషకు చండీఘడ్ కు చెందిన ఒక బిజినెస్ మ్యాన్ తో పెళ్లి కుదిరింది అన్న వార్త కోలీవుడ్ ను షేక్ చేసింది. ఇరువర్గాల కుటుంబాలు కూడా మాట్లాడుకొని త్వరలోనే పెళ్లి ముహూర్తం కూడా ఫిక్స్ చేశారని రూమర్స్ స్ప్రెడ్ అయ్యాయి. తాజాగా తన పెళ్లి వార్తలపై త్రిష స్పందించింది. పెళ్లి లేదు ఏమి లేదు అని స్ట్రైట్ గా చెప్పకుండా సెటైరికల్ గా నా పెళ్లిపై వీరి ఇంట్రెస్ట్ ఏంటో అన్నట్లు చెప్పకొచ్చింది. ' నా కోసం నా జీవితాన్ని ప్లాన్ చేసేవారిని నేను ప్రేమిస్తాను. నా హనీమూన్ షెడ్యూల్ ను కూడా ఎప్పుడు ప్లాన్ చేస్తారా అని ఎదురుచూస్తున్నాను' అంటూ రాసుకొచ్చింది. ఈ ఒక్క పోస్ట్ తో అమ్మడు పెళ్లి వార్తలకు ఫుల్ స్టాప్ పెట్టింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ చిన్నది ఇప్పట్లో పెళ్లి చేసుకుంటుందా.. ? లేదా అనేది చూడాలి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.